# ఫలించిన ప్రయోగం!

పిచ్చి పలు రకాలు!

డబ్బు పిచ్చి... పదవి పిచ్చి... ప్రేమ పిచ్చి... నాటకాల పిచ్చి... సినిమా పిచ్చి... సంగీతం పిచ్చి... ఇలా ఎన్నో...?

దామోదరానికి కథలు వ్రాయాలనే పిచ్చి!

ఈ పిచ్చోడు ఓ గవర్నమెంట్ ఆఫీసులో ఎల్డీసీ! ఇతగాడు కనే కలలు మాత్రం టెక్నీకలర్లో వుంటయ్.

తానొక పెద్ద రచయిత కావాలనే ఆరాటం! తెల్లకాగితం కనిపిస్తే చాలు కరకర నమిలి మింగినంత ఆవేశంతో ఓ కథ రాసేస్తాడు.

ఆఫీసులో సగం 'స్టేషనరీ' దామోదరం కథలు వ్రాయటానికే సరిపోతుంది.

పత్రికాఫీసుకు పంపటానికి కేవలం అతను ఖర్చు పెట్టేది పోస్టేజి మాత్రమే.

ఒకసారి ఆఫీసు ఫైల్లో తెలుగుల్లో నోట్ వ్రాయటానికి బదులుగ ఓ బుల్లికథ వ్రాసేడు. తెలుగు భాషకి వన్నెతెచ్చినట్టు ఫీలైపోయాడు. బాస్ పిల్చి చడామడా తిట్టినప్పుడు గాని తాను చేసిన తప్పు తెల్సుకోలేకపోయాడు.

అయినా దామోదరం పట్టువీడని విక్రమార్కుడిలా... పల్టీకొట్టిన పతంగ్‌లాగ... శరపరం పరలుగా కథలు వ్రాసి, పంపే ప్రతికథా పత్రికాఫీసులనుండి తిరిగొచ్చినా కన్యాశుల్కంలో గిరీశంలా 'డామిట్! కథ అడ్డం తిరిగింది (తిరిగొచ్చింది) అనేసి ఫీలవడు.

మరీ పవర్‌ఫుల్‌గ అతగాడి గురించి చెప్పాలీ అంటే... సిగ్గులేని రచయిత అనే అనాలి! సిగ్గున్న రచయిత కథ వ్రాయలేడు అనేది దామోదరం వితండవాదం!

మామూలు కథైతే ఆఫీసు వేళల్లోనే వ్రాసేస్తాడు. అదే పోటీకి పంపాల్సిన కథైతే తీరిగ్గా ఇంటిదగ్గర కూర్చుని రాత్రిళ్ళు వ్రాస్తాడు (అదీ ఆఫీసు కాగితాలమీదే).

రాజుకంటే మొండివాడు బలవంతుడనే సామెత దామోదరానికి 'తు.చ' తప్పకుండా వర్తిస్తుంది. ఎంచేతనంటే తిరిగొచ్చిన ప్రతి కథా ఓ మాస్టర్‌పీస్ అనుకుని కచ్చతో మరోటి వ్రాస్తాడు.

దామోదరం అంటే జాదుగరే! ఎవరికీ చిక్కడు... దొరకడు...! అమోఘమైన తెలివి అతగాడి 'సొత్తు'. మనిషి అబద్ధాల పుట్ట! రచయితలతో కలిసి తిరుగుతూ కోతలు కోయటం అతగానికో సరదా!

సీనియర్ రైటర్లవెంట చేతులు పిసుక్కుంటూ తిరుగుతూ కథారచనలో మెళకువలు తెల్సుకోవాలని తాపత్రయపడుతుంటాడు. వారికి కాఫీ గట్రా పోయిస్తుంటాడు. అందుకు లొంగని వారికి 'మందో... మాకో...!' పోయించి పుణ్యం కట్టుకునేందుకు క్క్యూడా వెనకాడడు.

అలాగని దామోదరాన్ని 'బఫూన్' అనుకుంటే పప్పులో కాలేసినట్టే!

ఏ (అ) శుభముహూర్తాన కథారచన చేపట్టాడో గానీ ఏ వక్క కథ అచ్చుకు నోచుకోవటంలేదు.

తీయంగా తీయంగ రాగం... మూల్గంగ మూల్గంగ రోగం అన్న సామెతలా వ్రాయంగ వ్రాయంగ చివరికో కథ ఓ పత్రికలో అచ్చయింది. అతని సంబరానికి పట్టపగ్గాల్లేకుండా పోయినయ్.

ఆఫీసులో వారందరికీ పుల్లారెడ్డి స్వీట్స్ పంచాడు. కొందరిని (తన ఖర్చుతో) ఇంగ్లీష్ పిక్చర్‌కి తీసుకెళ్ళాడు. తనకు ప్రమోషనొచ్చినట్టు... ఇంగ్లీష్ ఛానల్ బహు తేలికగా ఈదినట్టు ఉబ్బితబ్బిబ్బు అయ్యాడు.

తానొక ప్రసిద్ధ రచయితై 'పద్మశ్రీ' బిరుదు తనకు ప్రదానం చేసినంత ఆనందం అతడ్ని కుదిపేసింది.

తెలుగు ప్రపంచ మహాసభలకు తాను 'అమెరికా' తప్పక వెళ్ళగలననే ధీమాగా ఉన్నాడు.

ప్రచురించబడిన కథకి పారితోషికం వచ్చేలోపుగా... ఆ పత్రిక తాడు పుటుక్కున తెగి సంచిక రావటం ఆగిపోయింది! అయినా చింతించలేదు దామోదరం.

అలా... అలా... దామోదరం వ్రాసిన కథలను రెండుమూడు సంపుటాలుగా (అముద్రితాలనే) ఎవరైనా ప్రచురిస్తే బావుండనుకున్నాడు.

ఎందరో పబ్లిషర్స్‌ని కలిసాడు. తన వుద్దేశ్యం విన్పించాడు.. వారి కాళ్ళావేళ్ళా పడ్డాడు! భోరున ఏడ్చాడు. ఏ పబ్లిషర్ హృదయమూ ద్రవించలేదు. అయినా బాధన్పించలేదు దామోదరానికి.

ఇట్లా లాభం లేదని... తానే స్వయంగా పుస్తకాలు అచ్చు వేయటానికి పూనుకుంటే ఎట్లా వుంటుందీ? అనే ఆలోచనొచ్చింది అతగాడికి.

డి.టి.పి., ప్రింటింగ్, అట్టమీద బొమ్మ, కలర్ ప్రింట్లో కవర్‌పేజీ... తెల్లకాగితాల ఖర్చు... అమ్మో బోలెడంత ఖర్చుతో కూడుకున్న పనిలా అన్పించింది! అంత డబ్బు తనకెక్కడిదీ? నెలజీతం తప్పించి మరో విధమైన ఆదాయంలేని వుద్యోగమాయె?

ఛీ!... వెధవ బ్రతుకు... తనను తాను నిందించుకున్నాడు. బ్యాంకు లోనుకు ట్రై చేశాడు.

ఫలించలేదు.

ఓ యాభైవేలు సర్దమని పిల్లనిచ్చిన మామగారికి వ్రాసి 'ఛీ' కొట్టించుకున్నాడు.

ఆలోచించగ ఆలోచించగా... బామ్మ పేర నున్న ఎకరం పొలం సంగతి గుర్తొచ్చింది. తన్మయత్వంతో ఎగిరి గంతేసాడు.

పుస్తకాల ఆలోచన మనుమడు చెప్పగానే కస్సుమంటూ తోక తొక్కిన తాచులా బుసకొట్టింది! తాను బ్రతికివుండగా పొలాన్ని అమ్మటానికి వీల్లేదంది! ఇలాంటి అప్రాచ్యపు పన్లకి పైసా కూడా ఇచ్చేదిలేదని కరాఖండిగ చెప్పేసింది.

దామోదరం ముఖం అట్లపెనంలా మాడిపోయింది.

ఆఖరిగా... శ్రీమతిని కాకాపట్టడం తప్పించి మరోదారి అవుపించలేదు.

"నోర్ముయ్యండి! పుస్తెలతాడు తప్ప మీ వాళ్ళు నాకు పెట్టిందేమీలేదు. నావంటినున్న సొమ్ము నా పుట్టింటివారిచ్చింది.. దీన్ని తాకేరో..." అంటూ కళ్ళెర్ర జేసి ఒంటికాలిమీద లేచింది మంగతాయారు.

అక్కడితో ఆలోచన్లకి ఫుల్‌స్టాప్ పడ్డట్టయింది.

★★★★★

అయినా మనసులో వున్న దురద అతడ్ని వదిలేలా లేదు.

కొత్త ప్లాన్ బుర్రలో ఫ్లాషైంది!

కథల... కవితల పోటీ తానే నిర్వహిస్తున్నట్టు పేపర్లో ప్రకటనిస్తే?...

తీవ్రంగా ఆలోచించాడు. తన వీపు తానే 'సెభాష్' అని చేత్తో చరుచుకున్నాడు.

కీ.శే. మంగతాయారు పేర ఒక సంస్థ వున్నట్టుగా కల్పించి ఆమె స్మారకార్థం కథల పోటీ నిర్వహిస్తున్నట్టు... ఆకర్షణీయమైన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వుంటాయనీ... బహుమతి పొందిన వాటితో పాటు నచ్చిన మరికొన్నింటిని ఎంచి సంకలనాలుగ, సంపుటాలుగ వేస్తామంటు ప్రకటనలిచ్చి... ఎంట్రీ ఫీజు కింద ప్రతి రచయితా (త్రీ) కథతోపాటు రూ. 500/-... కవితకైతే రూ. 250/- మని ఆర్డరు ద్వారా గానీ/ డి.డి. ద్వారా గానీ పంపాల్సి వుంటుందనీ... ఓ శుభముహూర్తాన అన్ని పేపర్లలో న్యూస్ గుప్పించాడు.

బ్రతికి లక్షణంగా భర్తతో కాపురం చేస్తున్న తాను చనిపోయినట్టు పేపర్లో ప్రకటన ఇచ్చినందుకు మంగతాయారు మండిపడింది. జుట్టట్టుకుంది! బొట్టు తుడిపేసుకుంది. తాళి తెంచేసుకుంది. తెల్లచీర కట్టేసుకుంది.

ప్రకటన ఇవ్వటంతో గల మతలబు చెప్పి భార్యని ఒప్పించేసరికి దామోదరం తలప్రాణం తోకకొచ్చింది.

★★★★★

పత్రికల్లో ప్రకటన వచ్చి నలభైఎనిమిది గంటలైనా కాకముందే... కథలు... కవితలు... డి.డి.లు... మనిఆర్డర్లు శరపరంపరగ వచ్చి పడటం మొదలైంది.

ఆశించిన దానికంటే ఎన్నో రెట్లు అధికంగా రెస్పాన్స్ రావటం చూచిన దామోదరానికి మతిపోయినట్టయింది.

గడువులోపు వచ్చిన కథలు... కవితలు దాచటానికి ఓ బీరువా చాల్లేదు.

ఎంట్రీ ఫీజు కింద వచ్చినదంతా వెరసి ఆయిదు లక్షల రూపాయలపైగా వుండటంతో దామోదరం కళ్ళు తిరిగినయ్.

పరమానందభరితుడయ్యాడు!

బహుమతుల కింద ఇచ్చేది పోనూ... మిగతా డబ్బుతో తాను వ్రాసిన కథలను అచ్చువేసుకోగల అవకాశం కలిగినందుకు కోటి దేవుళ్ళకి మొక్కేడు.

తన పాచిక పారింది. ప్లాన్ సక్సెస్ అయింది.

"ఏమైనా... నా మొగుడు తెలివైనోడే..." అంటూ మెచ్చుకుంది మంగతాయారు.

అమోఘమైన తెలివితేటలతో ప్రయోజకుడైనందుకు దామోదరం బామ్మ ఎంతో సంబరపడింది!

తన ప్రయోగం ఫలించినందుకు దామోదరం ఆనందానికి అవధుల్లేకుండా పోయినయ్!